సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం । 17 । ఆగస్టు । 2023



30 పడకల ఆస్పత్రి కలేనా..
మోత్కూరులోని పీహెచ్‌సీ 30 పడకల ఆస్పత్రిగా మారుస్తామన్న నేతల హామీ అమలుకు నోచుకోవడం లేదు. - 9లో



ఆదాయం రూ.1.89 కోట్లు
యాదాద్రి హుండీలను బుధవారం లెక్కించారు. 22 రోజులకు రూ.1.89 కోట్ల ఆదాయం సమకూరింది. - 10లో



గంజాయి రవాణా ముఠా అరెస్ట్
గంజాయి రవాణా చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను డీసీపీ రాజేష్ చంద్ర వెల్లడించారు. - 10లో

న్యూస్‌రీల్

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

భువనగిరి టౌన్: కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కుష్టు వ్యాధి నివారణ అధికారి డాక్టర్ పాపారావు ఆదేశించారు. బుధవారం భువనగిరిలో చేపట్టిన కుష్టు వ్యాధి గుర్తింపు సర్వేను ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఆశా కార్యకర్త గ్రామీణ ప్రాంతంలో 15 నుంచి 20 ఇళ్లు, పట్టణ ప్రాతంలో 20 నుంచి 24 ఇళ్లను సర్వే చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 704 టీమ్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ధరణి కుమార్, జ్యోతి, సతీష్ పాల్గొన్నారు.

సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి


వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

భువనగిరి టౌన్: ఆత్మకూరు(ఎం) మండలం మొరిపిరాల గ్రామంలో దళితబంధు పథకంలో అక్రమాలకు పాల్పడిన గ్రామ సర్పంచ్ తిరుమలరెడ్డిపై చర్యలు తీసుకొని మా డబ్బులు ఇప్పించాలంటూ గ్రామానికి చెందిన దళిత బంధు లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం భువనగిరిలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. యూనిట్లు అందించేందుకు తమ వద్ద పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసినట్లు లబ్ధిదారులు వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోని మాకు న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రంలో సమర్పించిన వారిలో ముప్పిడి సుకన్య, ముప్పిడి లలిత, ముప్పిడి నర్సమ్మ, మేడి పద్మ, ముప్పిడి హేమలత, ముప్పిడి దేవి, ఇంద్రపల్లి వరలక్ష్మి, ముప్పిడి మారమ్మ ఉన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి


నిరసన తెలుపుతున్న శ్రీనివాస్ తదితరులు

భువనగిరి టౌన్: యాదాద్రి దేవస్థానంలో భర్తీ చేస్తున్న 120 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూస శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ పోస్టులను స్థానికులు ఇవ్వకుండా డబ్బులు తీసుకొని స్థానికేతులకు ఇస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం భువనగిరిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యాదాద్రిని రెండో తిరుపతిగా తీర్చిదిద్దుతుంటే.. ఆలయ ఈఓ గీతారెడ్డి మాత్రం ఆలయ ప్రతిష్ఠను భ్రష్టు పట్టిస్తున్నారన్నారు. ఔట్ సోర్సింగ్ పోస్టులను స్థానికులతో భర్తీ చేయకుంటే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ యాదవ్ చాట్ల సత్యనారాయణ, ఆదిత్య, వినయ్ కుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం

భువనగిరి టౌన్: యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలయ్యాయని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ అన్నారు. బుధవారం భువనగిరిలోని ఆ సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గ నవీన్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను విస్మరించి నిరుద్యోగులను మోసం చేస్తున్నాయన్నారు. నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన ప్రభుత్వాలు ఇప్పుడు మొండి చేయి చూపుతున్నాయని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, జిల్లా సహాయ కార్యదర్శులు నాగటి ఉపేందర్, ఉప్పలపల్లి బాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు దయ్యాల మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ. సలీం, రత్నం శ్రీకాంత్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ దీప బుధవారం ఒక ప్రకటనలో కోరారు. హెచ్‌బీటీ హిందీ- 2 (ఎంఏ హిందీ బీఈడీ/హెచ్‌పీటీ), మ్యాథ్స్- 01(ఎంఎస్‌ఈ, బీఈడీ, మ్యాథ్స్), తెలుగు పీజీటీ -1(ఎం.ఏ.తెలుగు, బీఈడీ, టీపీటీ), కెమిస్ట్రీ పీజీటీ - 1(ఎమ్మెస్సీ, బీఈడీ కెమిస్ట్రీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 21న ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో పాఠశాలకు హాజరుకావాలని తెలిపారు. ఇంటర్వ్యూ, డెమో ద్వారా ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు


ఆలయంలో జోడు సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువ జామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం స్వయంభూలకు బిందెతీర్థం, ఆరాధన గావించారు. శ్రీస్వామి వారికి బాలభోగం చేపట్టిన తరువాత మూలవర్యులకు నిజాభిషేకం నిర్వహించి, అలంకరించారు. శ్రీస్వామివారికి విశేషంగా సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు శ్రీస్వామి వారి దర్శనం భాగ్యం కల్పించారు. ఇక ఆలయంలో సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం, నిత్య కల్యాణం, తిరువీధి జోడు సేవలను నిర్వహించారు. రాత్రి పవళింపు సేవను నిర్వహించి, ఆలయాన్ని మూసివేశారు.

డబ్లింగ్‌కు గ్రీన్ సిగ్నల్

బీబీనగర్ – నడికుడి రైల్ మార్గంలో రెండో లైన్‌కు కేంద్ర కేబినెట్ కమిటీ ఆమోదం

- 239 కి.మీ మేర పనులు
- ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.2853.23 కోట్లు
- మెరుగుపడనున్న ఉపాధి అవకాశాలు

సాక్షి, యాదాద్రి : బీబీనగర్ – నడికుడి రైల్వే లైన్ డబ్లింగ్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా మీదుగా గుంటూరు జిల్లా నడికుడి వరకు గల ఈ మార్గంలో 239 కి.మీ మేర డబ్లింగ్ పనులను రూ.2853.23 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ బుధవారం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా ఈ మార్గంలో రైళ్ల సంఖ్య పెంచడానికి దోహదపడుతుంది. తద్వారా రైలు ప్రయాణం.. సమయ పాలనతోపాటు ఎలాంటి అడ్డంకులూ లేకుండా సజావుగా సాగుతుంది. డబ్లింగ్ ప్రాజెక్ట్ వలన ఈ ప్రాంత ప్రజల ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. దక్షిణ, తూర్పు భారత దేశ ప్రాంతాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలతో పాటు మధ్య, పశ్చిమ భాగాలైన తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రను ఈ లైన్ కలుపుతుంది.

డబ్లింగ్‌తో ప్రయోజనాలు ఇవీ..

- బీబీనగర్ – నడికుడి మార్గం సికింద్రాబాద్, విజయవాడ మధ్య ప్రత్యామ్నాయ మార్గం కావడం వల్ల కాజీపేట, వరంగల్, ఖమ్మం మీదుగా వెళ్లే మార్గంలోని రైళ్ల రద్దీని తగ్గించవచ్చు.
- సికింద్రాబాద్ నుంచి గుంటూరు, విజయవాడకు దగ్గర మార్గం కావడం వల్ల సెక్షన్ డబ్లింగ్ చేయడం వలన సికింద్రాబాద్, గుంటూరు, విజయవాడ మధ్య ప్రయాణ వేగం పెరుగుతుంది.


బీబీనగర్- నడికుడి మార్గంలో ప్రస్తుతం ఉన్న సింగిల్‌లైన్

- గుంటూరు–బీబీనగర్ సెక్షన్ లైన్ కెపాసిటీ వినియోగం 148.25 శాతం. ఈ విభాగంలో నిలుపుదల వల్ల ప్యాసింజర్, గూడ్స్ రైళ్ల నడపడంలో ఎదురవుతున్న ఇబ్బంది తొలగిపోతుంది.
- హైదరాబాద్, బీబీనగర్, నాగిరెడ్డిపల్లి, వలిగొండ, రామన్నపేట, చిట్యాల, నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, దాచేపల్లి, పిడుగురాళ్ల, సత్తెన్నపల్లి, గుంటూరు వరకు ప్రయాణికుల సౌలభ్యం పెరుగుతోంది.
- నడికుడి – బీబీనగర్ సెక్షన్‌ను డబ్లింగ్ చేయడం వల్ల సెక్షన్ సామర్థ్యం పెరుగుతుంది. తద్వారా మరిన్ని గూడ్స్, ప్యాసింజర్ రైళ్లను ప్రవేశ పెట్టవచ్చు.

ప్రధాని మోదీకి కృతజ్ఞతలు



బీబీనగర్ – నడికుడి లైన్ డబ్లింగ్ పనులు మంజూరు చేసిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు. డబ్లింగ్ పనుల కోసం నా నియోజకవర్గం ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారు. ఈ ప్రాజెక్టుతో యాదాద్రి, నల్లగొండ జిల్లాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంది. ఉత్తర, దక్షిణ భారత దేశం మధ్యన ప్రయాణ దూరం తగ్గుతుంది. ఈ ప్రాంతం అభివృద్ధికి దోహద పడుతుంది.
– ఎంపీ కోమటిరెడి వెంకట్ రెడ్డి

పారిశ్రామిక క్లస్టర్లకు మరింత మేలు

- ఈ మార్గంలో ఉన్న ప్రధాన పారిశ్రామిక క్లస్టర్, కారిడార్లకు మేలు చేకూరనుంది. చిట్యాల, నార్కట్‌పల్లి ఏరియాలో ఉన్న ఇనుము పరిశ్రమలకు లబ్ధికలుగుతుంది.
- విష్ణుపురం, నడికుడి, తుమ్మలచెరువు, జాన్ పహాడ్, మేళ్లచెరువు, మఠంపల్లి, జగ్గయ్యపేట, రామాపురం మొదలైన ప్రాంతాల్లోని సిమెంట్ పరిశ్రమలకు మేలు కలుగుతుంది.
- దామచర్ల మండలంలో ఏర్పాటవుతున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టుకు ఈ రైల్వే లైన్‌తో ప్రయోజనం కలుగుతుంది.
- నాగిరెడ్డిపల్లి వద్ద (ఎఫ్‌సీఐ) సైడింగ్, నల్లగొండ, మిర్యాలగూడ ప్రాంతాలలోని ఆహార పరిశ్రమలకు లబ్ధిచేకూరుతుంది.
- హైదరాబాద్ చుట్టూ 100కి పైగా వేర్‌హౌస్‌లు, గుంటూరు చుట్టూ 50కి పైగా కోల్డ్ స్టోరేజీలకు మేలు కలుగుతుంది.

కలిసి పనిచేస్తే గెలుపు ఖాయం


భువనగిరిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాస్ మానే, పక్కన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

- పైరవీలు చేసేవారికి టికెట్లు రావు
- తెలంగాణలో ఇద్దరు సైతాన్‌లతో పోరాడాల్సి ఉంది
- కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ మానే
- భువనగిరిలో పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశం


మాట్లాడుతున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : కలిసికట్టుగా పనిచేస్తే కర్ణాటక తరహాలో తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం కోఆర్డినేటర్ శ్రీనివాస్ మానే అన్నారు. బుధవారం భువనగిరిలో జరిగిన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన.. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. కర్ణాటక తరహాలో ఇక్కడ పార్టీ నిర్మాణం జరగాలన్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని రెండు అసెంబ్లీ స్థానాలను బీసీలకు కేటాయించాలని అధిష్టానం నిర్ణయించిందన్నారు. క్షేత్ర స్థాయిలో పనితీరును పరిశీలించి టికెట్లు ఇస్తామని, పైరవీలు చేసేవారికి టికెట్లు రావన్నారు. కర్ణాటకలో కొన్ని టికెట్లు ఇలా ఇవ్వడం వల్లే మెజార్టీ తగ్గిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి బీజేపీ, బీఆర్ఎస్ అనే ఇద్దరు సైతాన్‌లతో పోరాడాల్సి ఉందన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి పదవి వద్దు..

భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో కాంట్రాక్టర్లు, రియల్టర్లకు స్థానం లేదని, అలాంటి వారుంటే వెళ్లిపోవచ్చన్నారు. కేసీఆర్ కేబినెట్‌లో సామాజిక తెలంగాణ లేదని, ఉన్నదంతా ఓసీలేనని అన్నారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు పంట నష్టం పది వేల రూపాయలు ఏవని ప్రశ్నించారు. తనకు ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి పదవి అవసరం లేదని.. బతుకు తెలంగాణ కావాలన్నారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వియ్యంకుడికి గంధమల్ల రిజర్వాయర్ పనులు అప్పగిస్తే ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదన్నారు. ఇటీవల ఔటర్ రింగ్ రోడ్డును కాంట్రాక్టర్లు అప్పగించి ఆ డబ్బులతో కేసీఆర్ రుణమాఫీ చేశాడని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని చెప్పారు. భువనగిరి డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు కె.నగేష్, మల్‌రెడ్డి రంగారెడ్డి, కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, నాయకులు బండ్రు శోభారాణి, బీర్ల అయిలయ్య, పంజాల రామాంజనేయులు, పచ్చి మట్ల శివరాజ్ గౌడ్, పోత్నక్ ప్రమోద్‌కుమార్, తంగెళ్లపల్లి రవికుమార్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కొండేటి మల్లయ్య, రాపోలు జయప్రకాశ్, కల్లూరి రామచంద్రారెడ్డి, జనగామ ఉపేందర్‌రెడ్డి, భువనగిరి, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్, జనగామ, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ సెగ్మెంట్ల ఆశావహులు, ముఖ్యనాయకులు, జెడ్పీటీసీలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మాక్ పోలింగ్‌పై అవగాహన కల్పిస్తున్నాం

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర అధికారులు

భువనగిరి టౌన్: మాక్ పోలింగ్‌పై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల జాయింట్ ప్రధాన అధికారి సర్ఫరాజ్ అహ్మద్ రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి రాష్ట్ర శాసనసభకు జరగబోయే సాధారణ ఎన్నికలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో మొబైల్ వాహనాల ద్వారా పోలింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించామన్నారు. వచ్చే ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, భువనగిరి మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, జిల్లా కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లపై నమ్మకం పెంచాలి


వర్క్‌బుక్స్ పరిశీలిస్తున్న డీఈఓ నారాయణరెడ్డి

భువనగిరి టౌన్: ప్రభుత్వం పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులను నమ్మకం పెంచేలా విద్యా బోధన చేయాలని డీఈఓ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం భువనగిరి మండలం బండసోమవారంలోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తొలిమెట్టు, బుధవారం బోధన కార్యక్రమాలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు సరఫరా చేస్తున్న కరదీపకలను రోజూ పరిశీలించి విద్యార్థులకు సూచనలు చేయాలని ఆదేశించారు. కరదీపకలను చదవకుండా విద్యార్థులకు ఎలా బోధన చేస్తారని ప్రశ్నించారు. విద్యార్థులు సామర్థ్యాలను గుర్తించి అందరూ ఒకే విధంగా చదవడం, రాయడం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట హెచ్ఎం జయంతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులను క్షేమంగా తీసుకెళ్లాలి : డీఈఓ

జాతిపిత గాంధీ సినిమాను చూపించేందుకు పాఠశాలల విద్యార్థులు క్షేమంగా తీసుకెళ్లి తీసుకు రావాలని ఎంఈఓలు, హెచ్ఎంలకు జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన భువనగిరిలో పలు సినిమా థియేటర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 8 సినిమా థియేటర్లలో ప్రదర్శిస్తున్న గాంధీ చలనచిత్రాన్ని ఇప్పటి వరకు 3,498 మంది విద్యార్థులు చూశారన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓలు, హెచ్ఎంలకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా థియేటర్ల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.


రేపు సర్వాయి పాపన్న జయంతి

భువనగిరి టౌన్: ఈ నెల 18వ తేదీ ఉదయం 10:30 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373వ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు బీసీ కుల సంఘాల నాయకులు, ప్రజలు, అధికారులు, అనధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

19న గద్దర్ సంతాప సభ

భువనగిరి టౌన్: తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆధ్వర్యంలో ఈ నెల 19న భువనగిరిలోని అమరుల స్థూపం వద్ద నిర్వహించనున్న ప్రజాగాయకులు గద్దర్, జహీర్ అలీఖాన్‌ల సంతాప సభను జయప్రదం చేయాలని ఆ ఫ్రంట్ జిల్లా గౌరవ సలహాదారుడు బట్టు రామచంద్రయ్య జిల్లా కన్వీనర్ కాశపాక మహేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ముద్రించిన సంతాప సభ కరపత్రాల బుధవారం భువనగిరిలో ఆవిష్కరించి మాట్లాడారు. గద్దర్ మరణం ప్రజా, సాంస్కృతిక ఉద్యమాలకు తీరనిలోటని పేర్కొన్నారు. గద్దర్ అంత్యక్రియల రోజే ఆయన స్నేహితుడు జహీర్ అలీఖాన్ చనిపోవడం బాధాకర విషయమన్నారు. వీరిద్దరిని స్మరించుకుంటూ ఈ సంతాప సభ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కావలి యాదయ్య, రాసాల బాలస్వామి, చిక్కుల కర్ణాకర్, రాజు పాల్గొన్నారు.

టీటీడీ భూములు ఆక్రమిస్తే ఊరుకోం


వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

భువనగిరి టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం భూములు, ఇతర ఆస్తులను కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఆక్రమించాలని చూస్తే ఊరుకోబోమని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం వీహెచ్‌పీ, హిందూ వాహిని, భజరంగ్ దళ్ ప్రతినిధులు, బీజేపీ కౌన్సిలర్లు, నాయకులుతో కలిసి భువనగిరి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీటీడీ ఆస్తులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాలు, పార్టీ నాయకులు తోట భాను ప్రసాద్, పోల శ్రీనివాస్ గుప్త, నార్ల నర్సింగరావు, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, మాయ దశరథ, బలరాం, బొర్రా రాకేష్, సుమవెంకటేష్, కవిత నర్సింహాచారి, ఎంగిలి లక్ష్మణ్, ఉడుత భాస్కర్, పట్నం కపిల్, నగేష్, భిక్షపతి, శ్రీశైలం, సంతోష్, రవీందర్, మల్లికార్జున్, కిషన్ జీ, కె.రాజు, శ్యామ్ సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ 50 ఏళ్లు.. జీతం రూ.4వేలు

- ప్రభుత్వ పాఠశాలల్లో పార్ట్ టైం స్వీపర్ల వెట్టిచాకిరీ
- ఉదయం బడి గంట కొట్టింది మొదలు సాయంత్రం వరకు విధుల్లోనే..
- రెగ్యులరైజ్ చేయాలని 52 రోజులుగా రిలే దీక్షలు
- హైపవర్ కమిటీ నివేదికను అమలు చేయాలని డిమాండ్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 85 మంది స్వీపర్లు



భువనగిరిలో రిలే దీక్ష చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం స్వీపర్లు

భువనగిరి టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం స్వీపర్లను పట్టించుకునే వారే కరువయ్యారు. 50 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని స్వీపర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమను శాశ్వత ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని వేడుకుంటున్నారు. ఇదే డిమాండ్‌తో భువనగిరిలోని జెడ్పీ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 52వ రోజుకు చేరాయి. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాలల స్వీపర్లకు నెలకు రూ.19,500 వేతనం చెల్లిస్తున్నారని, తామేమి పాపం చేశామంటూ స్వీపర్లు ప్రశ్నిస్తున్నారు.

1973లో నియామకం

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 85 మందిని 1973వ సంవత్సరంలో ప్రభుత్వం వివిధ పాఠశాలల్లో పార్ట్‌టైం స్వీపర్లుగా నియమించింది. ప్రాథమిక పాఠశాలల్లో 83 మంది, ఉన్నత పాఠశాలల్లో ఇద్దరు పని చేస్తున్నారు. అప్పట్లో నెలకు రూ.49 వేతనంతో నియామకమైన వీరు ఐదు దశాబ్దాలు గడుస్తున్నా.. ఇప్పటికీ రూ 4వేల వేతనమే పొందుతుండడం గమనార్హం. ఇచ్చే కొద్దిపాటి జీతం సకాలంలో రావడం లేదు. మూడు నుంచి ఐదు నెలలకు ఒసారి చేతికి అందుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళన బాట పట్టారు. అప్పట్లో నియామకమైన వారిలో కొద్దిమంది మృతిచెందగా వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులు విధులకు హాజరవుతూ వెట్టిచాకిరీ చేస్తున్నారు.

మా ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలి



ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలి. ఈ విషయంపై గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయాలి. ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించకపోవడంతో బాధాకరం. ఇప్పటికైనా ప్రభుత్వం ఆదుకోవాలి.
– చంద్రయ్య, స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు, భువనగిరి

పేరుకే పార్ట్‌టైం..

ప్రభుత్వం పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం స్వీపర్లది పేరుకు పార్ట్ టైం ఉద్యోగమైనా ఉదయం గంట కొట్టింది మొదలు సాయంత్రం విద్యార్థులను వదిలే వరకు పని చేయాల్సిందే. ఉపాధ్యాయుల కంటే ముందే వచ్చి పాఠశాలల ఆవరణలు, మూత్రశాలలు, శుభ్రం చేయడం పాటు, ఉపాధ్యాయులు చెబుతున్న వ్యక్తిగత పనులు సైతం చేస్తుంటారు. పాఠశాలల్లో ఆవరణలో ఉంటే మొక్కలు పెంపకం, మధ్యాహ్న భోజనం సమయంలో వంటవారితోపాటు పిల్లకు సహాయం చేయడం తదితర పనులు చేస్తూ సాయాత్రం 5 గంటల వరకు విధులు నిర్వహిస్తుంటారు. అయినప్పటికీ వీరికి వేతనంతో కూడిన సెలవులు, వైద్యం, ఇంటి అద్దె తదితర సౌకర్యాలేవీ లేవు.

గతంలో ఉత్తర్వులు జారీ చేసినా..

1996లో హైపవర్ కమిటీ వేశారు. వీరు పనిచేసే చోట శాశ్వత ఉద్యోగులు లేని నేపథ్యంలో వీరిని శాశ్వత ఉద్యోగులుగా నియమించవచ్చని ఆ కమిటీ నివేదిక అందజేసింది. నాలుగో తరగతి ఉద్యోగులుగా పరిగణించవచ్చని ఆ కమిటీ నివేదిక ఇచ్చింది. ఉత్తర్వులు వచ్చి 27 ఏళ్ల గడిచినా అమలుకు నోచుకోవడం లేదు. నాటినుంచి నేటివరకు ప్రభుత్వాలు మారుతున్న తమ తలరాతలు మారడం లేదని పార్ట్‌టైం స్వీపర్లు అంటున్నారు. ఇటీవల రాష్ట్ర మంత్రులను కలిసి 1996 నాటి ఉత్తర్వులను అమలు చేయాలని కోరినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా తమ సర్వీస్‌ను గుర్తించి రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని పార్ట్‌టైం స్వీపర్లు కోరుతున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నాగార్జునసాగర్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన నాగార్జున సాగర్‌లోని హిల్‌కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. విజయపురిటౌన్ ఎస్ఐ సంపత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.నల్లగొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మాచర్ల నుంచి సాగర్ వైపు వస్తోంది. హిల్‌కాలనీ బస్టాండు నుంచి మూడురోడ్ల కూడలి దాటి సత్య నారాయణస్వామి ఆలయం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టుకున్నాయి. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మాచర్ల నివాసితులైన సత్యనారాయణ, నాగమ్మకు గాయాలయ్యాయి. సత్యనారాయణను స్థానిక కమలానెహ్రూ ఆస్పత్రికి, నాగమ్మను నల్ల గొండకు తరలించారు. ఈ మేరకు కేసున మోదు చేసి విజయపురిటౌన్ ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆలయంలో చోరీ

కట్టంగూర్ : కట్టంగూర్ గ్రామ శివారు ఎస్ఎల్ బీసీ కెనాల్ వద్ద హైవే పక్కనే ఉన్న శ్రీ శివాంజ నేయ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మంగ ళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయ పూజారి నర్సింగోజు భిక్షమాచారి తెలిపిన వివ రాలు ఇలా ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తలుపుల తాళం, బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న అయ్యప్ప విగ్రహం, అమ్మ వారి పట్టు వస్త్రాలు, పూజా సామగ్రిని అపహ రించుకుపోయారు. అపహరణకు గురైన వస్తు వుల ధర సుమారు రూ.65వేలు ఉంటుందని పేర్కొన్నాడు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పూజారి తెలిపారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి

చందంపేట : చేపల వేటకు వెళ్లిన ఓ యువ కుడు విద్యుదాఘాతానికి గురై మృతిచెం దాడు. ఈ ఘటన చందంపేట మండలంలోని పేర్వాల గ్రామంలో చోటు చేసుకుంది. పేర్వాల గ్రామానికి చెందిన వెంకటయ్య, భువనేశ్వరమ్మ దంపతుల కుమారుడైన కడారి శివమణి(18) బుధవారం గ్రామంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ ఉన్న విద్యుత్ తీగలు ప్రమ దవశాత్తు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుమా రుడి మృతితో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

మనుమరాలు మరణాన్ని జీర్ణించుకోలేక..

- గుండెపోటుతో వృద్ధురాలు మృతి

కనగల్ : మనుమరాలు మరణాన్ని జీర్ణించు కోలేక ఓ వృద్ధురాలు గుండెపోటుతో మృ తిచెందింది. ఈ విషాదకర ఘటన కనగల్ మండల పరిధిలోని పగిడిమర్రి గ్రామంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పగిడిమర్రి గ్రామానికి చెందిన నీలకంఠం వెంకటయ్యల క్ష్మమ్మ కూతురు చైతన్య(27)కు గుర్రంపోడు మండల పరిధిలోని కాసర్ల మహేష్‌తో ఏడాది క్రితం వివాహం జరిగింది. మహేష్ నల్లగొం డ అన్నెపర్తి బెటాలియన్‌లో ఎస్ఐగా పనిచే స్తున్నాడు. వీరికి 6నెలల పాప ఉండటంతో చైతన్య నాయనమ్మ నీలకంఠం వెంకమ్మ(70) దగ్గర ఉండి పాప బాగోగులు చూసుకుంటోం ది. ఈ క్రమంలో సోమవారం చైతన్యకు గుం డెపోటుతో మృతిచెందింది. మనుమరాలి మృతిని జీర్ణించుకోలేకపోయిన వెంకమ్మ మరుసటి రోజు మంగళవారం గుండెపోటు తో మృతిచెందడటంతో గ్రామంలో విషాద చాయాలు అలుముకున్నాయి.

శుభ ముహూర్తాలు వచ్చేశాయ్ !

- 19నుంచి మోగనున్న భాజాభజంత్రీలు
- డిసెంబర్ వరకు కల్యాణ ఘడియలు
- ఫంక్షన్‌హాల్స్ ఇప్పటికే బుకింగ్



అర్వపల్లి: జూన్ 18నుంచి ఇప్పటి వరకు ఆషాడం, అధిక శ్రావణ మాసంతో శుభ ముహూర్తాలకు బ్రేక్ పడిన విషయం తెలిసిందే. దీంతో ఫంక్షన్‌హాల్‌లు మూతపడ్డాయి. వీటిని నమ్ముకుని పనిచేసే వారం తా ఏపని దొరక్క అవస్థలు పడ్డారు. ఎట్టకేలకు ఈ నెల 19 నుంచి శుభ ముహూర్తాలు మొదలు కాను న్నాయి. పల్లెపల్లెనా భాజాభజంత్రీలు మారుమోగ నున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అప్పుడే పెళ్లి సందడి నెలకొంటుంది. పెళ్లి సామగ్రి దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతు న్నాయి. పెళ్లి మండపాలు ముస్తాబవుతున్నాయి. శుభలేఖల ప్రింటింగ్ పనులు పూర్తి కాగా వంట, భాజాభజంత్రీల వారు, పురోహితులు అంతా సిద్ధ మవుతున్నారు.

శుభముహూర్తాల తేదీలు ఇలా..

ఈనెల 19,20,22,24,26,29,30,31తేదీల్లో, సెప్టెం బర్ 1,2,3,6,7,8 తేదీల్లో, అలాగే అక్టోబర్ 18,19,20,21,22,24,25,26,27,31తేదీల్లో, నవం బర్1,2,8,9,16,17,18,19,22,23,24,25,28,29తే దీల్లో, డిసెంబర్ 3,5,6,7,8,14,15,16,17,19,20, 21,24,31తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. అయితే పెళ్లిళ్ల నేపథ్యంలో బంగారు, వస్త్ర దుకాణాలు, పెళ్లి వస్తువుల దుకాణాలు రద్దీగా మారాయి. ఇదిలా ఉంటే జూన్18 నుంచి ఇప్పటి వరకు ఆషాడం, అధిక శ్రావణ మాసంతో రెండు నెలల పాటు పూర్తిగా శుభకార్యాలు లేక ఆయా వర్గాల వ్యాపారులు ఎంతో నష్టపోయారు. ఈనెల 19నుంచి శుభ ముహూర్తాలు ఉండటంతో ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని అన్ని ఫంక్షన్‌హాల్‌లు ముందస్తు గా బుక్ అయ్యాయి. ఈసారి ఎక్కువ ముహూర్తాలు ఉండటంతో వేద బ్రాహ్మణులు, బ్యాండ్ మేళం, సౌండ్ సిస్టమ్, లైటింగ్, డెకరేషన్, క్యాటరింగ్, వం టలు చేసేవారు, ఈవెంట్ ఆర్గనైజర్లు, వివిధ రకాల వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

5నెలల్లో 52రోజులు శుభ ముహూర్తాలు



జూన్ 18నుంచి ఇప్పటి వరకు ఆషాడం, అధిక శ్రావణ మాసంతో రెండు నెలల పాటు ముహూర్తా లకు బ్రేక్ పడింది. ఈ నెల 19నుంచి డిసెంబర్31 వరకు 52 శుభముహూర్తాలు ఉన్నాయి. ఈనెల లో 19,20,22,24,26,29,30,31 వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. అలాగే సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ డిసెంబర్ నెలల్లో కూడా కొన్ని శుభముహూర్తాలు ఉన్నాయి.

– మోత్కూరి రాజుశర్మ, పురోహితుడు, అర్వపల్లి

ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్, కాపర్‌వైరు చోరీ



దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు

మిర్యాలగూడ : గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని ఆయి ల్, కాపర్ వైర్లను అపహరించుకుపోయారు. ఈ ఘటన దామరచర్ల మండలం బొత్తలపాలెంలో చోటు చేసుకుంది. పోలీసులు, రైతులు తెలిపిన వివ రాల ప్రకారం .. నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి వెంట ఉన్న 25కేవీ సామర్థ్యం గల మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా వాటి నుంచి స్థానిక వ్యవ సాయ మోటార్లకు విద్యుత్ సరఫరా జరుగుతోంది. బుధవారం తెల్లవారుజామున దుండగులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వం సం చేశారు. అందులోని ఆయిల్, కాపర్ వైర్లను చోరీ చేశారు. విషయం తెలుసుకున్న విద్యుత్, పోలీసు అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలిం చారు. దుండగులు కొంతకాలంగా ట్రాన్స్‌ఫార్మర్ల లోని ఆయిల్, తీగలను, వ్యవసాయ మోటార్లను దొంగతనం చేస్తున్నారని పలువురు రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

- కోదాడ డీఎస్పీ ప్రకాష్

కోదాడరూరల్ : నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్ లు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ ప్రకాష్ తెలిపారు. బుధ వారం పట్టణంలోని బంజారకాలనీలో ఎస్పీ ఆదే శాల మేరకు కార్డన్‌సెర్చ్ నిర్వహించి మాట్లాడారు. తనిఖీల్లో భాగంగా ఎలాంటి పత్రాలు లేని 36 ద్విచక్రవాహనాలు, 5ఆటోలను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా ఐదుగురు పాత నేరస్తులను అదుపులోకి తీసుకొని విచారించి నట్లు డీఎస్పీ తెలిపారు. యువత చెడు వ్యాసనాలకు బానిసలు కావద్దని చదువుల్లో రాణిస్తు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కాలనీలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమా చారం ఇవ్వాలని కోరారు. ఈ తనిఖీల్లో ముగ్గురు సీఐలు , 8మంది ఎస్ఐలు, 50 మంది సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : స్థానికులతో మాట్లాడుతున్న సీఐ

హుజూర్‌నగర్‌లో...

హుజూర్‌నగర్ : ప్రజారక్షణలో భాగంగా కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నట్లు సీఐ రామలింగారెడ్డి పేర్కొన్నారు.. హుజూర్‌నగర్‌లోని అంబేద్కర్ కాల నీలో బుధవారం తెల్లవారుజామున సీఐ ఆధ్వర్యం లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రా లు లేని ఆటో, 46 బైకులను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

భువనగిరి : రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెం దాడు. ఈ ఘటన బుధవారం భువ నగిరి-పగిడిపల్లి రైల్వే స్టేషన్ల మధ్య జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువ నగిరి-పగిడిపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ఎగువ లైన్ రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి రైలునుంచి పడిపోవడంతో తీవ్రంగా గాయ పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలిం చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలిం చారు. సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి ఒంటిపై ఆకు పచ్చ తెలుపు గీతలు కల ఆఫ్‌బొక్కతో పాటు బ్లూ జీన్ పాయింట్ ధరించి ఉన్నాడని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువ నగిరి హెడ్ కానిస్టేబుల్ ఎస్ సత్యనారాయణ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మోత్కూరు : గడ్డి మందు తాగి ఓ వివాహిత ఆత్మ హత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండాపురం గ్రామంలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మన్నె మమత, భర్తతో జరిగిన తగాదాతో మనస్తాపం చెంది వ్యవసాయ బావి వద్ద గడ్డి మందు తాగింది. గమనించిన భర్త మన్నె కిషోర్ ఆమెను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తర లించారు. ఆమె పరిస్థితి నిలకడగా ఉందని, ఎలాం టి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారని బాధి తురాలి బంధువులు తెలిపారు.

బోనాల పండుగలో అపశ్రుతి

- ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తుండగా ట్రాక్టర్ బోల్తా
- నలుగురికి స్వల్పగాయాలు



మహంకాళమ్మ దేవాలయం వద్ద బోల్తా కొట్టిన ట్రాక్టర్

శాలిగౌరారం: మండలంలోని చిత్తలూరు గ్రామం లో మంగళవారం సాయంత్రం జరిగిన మహం కాళమ్మ బోనాల పండుగలో అపశ్రుతి చోటుచేసు కుంది. బోనాల పండుగలో భాగంగా ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామానికి చెందిన రైతు చెరుకు సురే శ్‌కు చెందిన ట్రాక్టర్ ఇంజన్‌ను గిరగాని రామదాసు నడుపుతూ ప్రదక్షిణలు చేసే క్రమంలో ఒక్కసారిగా ట్రాక్టర్ తిరగబడింది. దీంతో ట్రాక్టర్‌పై కూర్చున్న గ్రామానికి చెందిన నలుగురు ఎగిరి దూరంగా పడ గా డ్రైవర్ రామదాసు చక్రాల కింద పడిపోయాడు. ట్రాక్టర్‌ను ఒక్కసారిగా పొగలు కమ్ముకోవడంతో దేవాలయం వద్ద భక్తులు భయాందోళనలతో దూరంగా పరుగులు పెట్టారు. వెంటనే కొంతమం ది యువకులు అక్కడకు చేరుకొని ట్రాక్టర్ కింద పడిన రామదాసును బయటకు లాగారు. ప్రమా దంలో ట్రాక్టర్‌పై కూర్చున్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడటంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



రాంబాబు (ఫైల్)

మునగాల(కోదాడ): విద్యు దాఘాతంతో ఓ వ్యక్తి మృ తిచెందాడు. ఈ ఘటన మున గాల మండల పరిధిలోని కల కోవ గ్రామ రెవెన్యూ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ లోకేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునగాల మండలం లోని నారాయణగూడెం గ్రామానికి చెందిన తాళ్ల పాక రాంబాబు(35) ఓ రైతు వద్ద ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. బుధవారం రాంబాబు విద్యుత్ మోటారు ఆన్ చేసేందుకు వెళుతూ పొలానికి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను దాటే ప్రయత్నం చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అం దలేదని, స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కాలి నడకన.. పది కిలోమీటర్లు!

- కుర్మేడ్‌గేట్ వద్ద అదృశ్యం.. మాల్‌లో ప్రత్యక్షం
- పోలీసులు, సోషల్ మీడియా చొరవతో తండ్రి చెంతకు చేరిన నాలుగేళ్ల బాలుడు



బాలుడు రవికుమార్

యాచారం: ఆడుకుంటూ బయటకు వచ్చిన ఓ బాలుడు.. పది కిలోమీటర్ల దూరంలో ప్రత్యక్షమ య్యాడు. పోలీసులు, సోషల్ మీడియా చొరవతో చివరకు తల్లిదండ్రుల వద్దకు చేరాడు. సీఐ సైదయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బీహార్‌కు చెం దిన చందన్‌కుమార్ నల్లగొండ జిల్లా చింతపల్లి మండల పరిధిలోని కుర్మేడ్‌గేట్ వద్ద(సాగర్ రోడ్డుకు సమీపంలో) ఓ డెయిరీ ఫాంలో కూలీ పని చేస్తూ కుటుంబంతో ఉంటున్నాడు. ఇతని కొడుకు రవికు మార్ బుధవారం ఉదయం డెయిరీ ఫాం నుంచి బయటకు వచ్చి.. రోడ్డు పక్కన నడుస్తూ మాల్‌కు చేరుకున్నాడు. అప్పటికే మధ్యాహ్నం కావడంతో ఆకలిగొన్న బాలుడు బిక్కుబిక్కుమంటూ మాల్‌లో (నల్లవెల్లి చౌరాస్తా) తిరగడాన్ని గమనించిన స్థానికు లు యాచారం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు చిన్నారిని పీఎస్‌కు తరలించారు. బాలుడి ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇది వైరల్‌గా మారి.. విషయం బాలుడి తండ్రి చం దన్‌కుమార్‌కు చేరింది. దీంతో స్థానికులతో కలిసి యాచారం పీఎస్‌కు వెళ్లాడు. రవికుమార్.. చందన్ కొడుకేనని నిర్ధారించుకున్న అనంతరం బాలుడిని అతనికి ఇచ్చి పంపించారు. ఇదిలా ఉండగా నాలుగేళ్ల బాలుడు పది కిలోమీటర్ల దూరం నడుచు కుంటూ వెళ్లాడా..? ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కనిపించకుండా పోయినప్పటికీ తల్లిదండ్రు లు ఎందుకు పట్టించుకోలేదు..? అనే విషయాలపై స్పష్టత లేకుండాపోయింది. ఈ విషయాలను అడి గేందుకు ‘సాక్షి’ చందన్‌కుమార్‌కు ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.

బండరాయి మీద పడి వ్యక్తి దుర్మరణం



శ్రీను(ఫైల్)

సంస్థాన్ నారాయణపురం: ప్రమాదవ శాత్తు జారి కిందపడిన వ్యక్తిపై బండరాయి పడడంతో తీవ్రంగా గాయపడి మృతిచెం దాడు. సంస్థాన్‌నారాయణపురం మండల పరిధిలో బుధవారం వెలుగుచూసిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సంస్థాన్ నారాయణపురం మండలం వెంకబావి తండాకు చెందిన రమావత్ శ్రీను(45) గొడ్డలి కర్ర లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గొడ్డలి కర్రలు తీసుకొని రావడానికి శ్రీను మంగళవారం రాచకొండ ఆటవీ ప్రాంతానికి వెళ్లాడు. గుట్టపైన చెట్టు కొమ్మ కొట్టే ప్రయత్నంలో జారిపడ్డాడు. ఈ సమయంలో రాయి కూడా దొర్లుకుంటూ వచ్చి శ్రీనుపై పడింది. దీంతో శ్రీను రెండు గుం డు రాళ్ల మధ్య ఇరుక్కుపోయి అక్కడిక క్కడే మృతిచెందాడు. కుంటుంబ సభ్యు లు మంగళవారం నుంచి వెతుకతుండగా బుధవారం గుట్టపైన శ్రీను మృతదేహం లభ్యమైంది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ మహేష్, ఎస్ఐ రాఘ వేంద్రలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. కుం టుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

విద్యుత్ హైఓల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం




దొండపాడులో కాలిన ఏసీ

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : విద్యుత్ హైఓల్టే జీతో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన చింతలపాలెం మండలం దొండపాడులో బుధవారం చోటు చేసుకుంది. దొండపాడు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో గల విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ వద్ద విద్యుత్‌లైన్లు తెగి ఒకదానిపై మరొకటి పడ్డాయి. దీంతో హైవోల్టేజీ వచ్చి ఆ లైన్‌పై ఉన్న దాదాపు వందకు పైగా ఇండ్ల లో ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలు ఇతర వస్తువులు కాలిపోయాయి. దీంతో రూ.30 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు పలు గృహాల యజమానుల వాపో యారు. హైఓల్టేజీ విషయాన్ని విద్యుత్‌శాఖ అధికారులకు రెండు నెలల క్రితం తెలియజేసినా పట్టించుకోవడం లేదని చెప్పారు. ఈ విషయమై విద్యుత్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి న్యూట్రల్ కట్ అయ్యి ఫేజ్‌పై పడటం వల్ల విద్యుత్ హైఓల్టేజీ వచ్చి కొంత నష్టం జరిగిందని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి

వేములపల్లి: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. ఈ సంఘటన బుధవారం తెల్లవారుజామున వేములపల్లిలో చోటు చేసుకుం ది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం తెల్లవారు జామున సుమారు 4 నుంచి 5గంటల సమయంలో అద్దంకి- నార్కట్ పల్లి రహదారిపై గుర్తుతెలియని మహిళ రోడ్డు దాటుతుండగా మిర్యాలగూడ నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ఆ మహిళ అక్కడికక్కడే మృతిచెందిం ది. ముఖం ఛిద్రం కావడంతో గుర్తు పట్టలేకుండా ఉంది. మృతురాలు సుమారు 30- 35సంవత్సరాల వయస్సు కలిగి ఉండి వంకాయ, ఎరుపురంగు చీర తో తెలుపు, ఎరుపురంగులోని జాకెట్ ధరించిం దని, ఎరుపు, నలుపురంగు కలిగిన చున్నీని ముఖా నికి వేసుకుని ఉందని, మహిళ కుడి చేతిపై త్రిశూ లం గుర్తుగల పచ్చబొట్టు, వేలుకు వినాయకుడి బొమ్మగల ఉంగరం, కాళ్లకు మెట్టెలు, పట్టీలు ఉన్నా యి. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్ప త్రిలో భద్రపరిచామని పోలీసులు తెలిపారు.

గాయపడిన మహిళ మృతి



తిప్పమ్మ (ఫైల్)

చింతపల్లి : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్ప త్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందింది. హైదరాబాద్ కాటేదార్‌కు చెందిన కేతేను తిప్పమ్మ (55) దేవరకొండలో బంధువు మృతి చెందడంతో అంత్యక్రియలకు వచ్చి వెళ్తుండగా మార్గమధ్యలో చింతపల్లి మండలం వెంకటంపేట వద్ద రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో గాయాలపాలైంది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో తిప్పమ్మ చికిత్స పొం దుతూ మృతి చెందింది. ఈ ప్రమాదంలో మరో ఏడుగురు కూడా గాయపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.

దంపతులపై దాడి చేసిన ముగ్గురిపై కేసు

మోతె : మండల పరిధిలోని నర్సింహాపురం వద్ద దంపతులపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం హత్యా తండాకు చెం దిన బదావత్ శ్రీను, రాజమ్మ దంపతులు ఇటీవల మోతె మండలం రావికుంటతండాకు బోనాల పండుగకు వచ్చారు. సోమవారం బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా నర్సింహాపురం బ్రిడ్జి వద్ద అదే గ్రామానికి చెందిన గుల్ల శ్రీను,కట్ల శేఖర్,వీర బోయిన గుర్వయ్యలు దాడి చేశారు. బదావత్ శ్రీను ఫిర్యాదు మేరకు ఈ ముగ్గురు వ్యకులపై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు అనుమానితుల అరెస్ట్

అడ్డగూడూరు : అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. అడ్డగూడూరు మండల పరిధిలోని ధర్మారం గ్రామంలోని బిక్కేరు వాగు పరిసరాల్లో ఇద్దరు వ్యక్తులు స్థానికులకు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారిని అదుపులోకి తీసుకు న్నారు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లాలో దొంగతనం చేసి పరారీలో ఉన్న వ్యక్తులుగా అనుమానిస్తున్నారు. అదుపులోకి తీసుకున్న ఇద్దరిని సూర్యాపేట జిల్లా పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.


కోతుల దాడిలో ఒకరికి గాయాలు

మోత్కూరు : కోతుల దాడిలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మోత్కూరులో బుధవారం చోటు చేసుకుంది. అన్నెపువాడ కాలనీకి చెందిన కోమటి లక్ష్మయ్య తన ఇంటి నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమం లో 10 కోతులు అతడిపై దాడి చేశాయి. వెంటనే ఇద్దరు వ్యక్తులు వచ్చి కోతు లను తరమివేశారు. గాయపడిన అతడిని ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి గాయాలు

నార్కట్‌పల్లి: తాటిచెట్టు పైనుంచి కిందపడడంతో ఓ గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన నార్కట్‌పల్లి మండల పరిధిలో చోటు చేసుకుంది. అమ్మనబోలు గ్రామానికి చెందిన కట్టంగూరు బాలయ్య గీత కార్మికునిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా జారి పడడంతో తీవ్రగాయాల య్యాయి. వెంటనే అతడిని స్థానికంగా ఉన్న కట్టం గూరు స్వామి, ఐలయ్య, బొడిగె భరత్ నల్లగొండ ప్రభుత్వ అస్పత్రికి తరలించారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన




ఎంజీయూ ఎదుట నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

ఎంజీయూ (నల్లగొండ రూరల్) : మహాత్మా గాంధీ యూనివర్సిటీ లో కాంట్రాక్ట్ అధ్యాప కులు తమను రెగ్యుల రైజ్ చేయాలని డిమాం డ్ చేస్తూ బుధవారం యూనివర్సిటీలో తరగతులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఇంటర్, డిగ్రీ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యుల రైజ్ చేసిన ప్రభుత్వం యూనివర్సిటీల్లోని కాంట్రాక్ట్ అధ్యాప కులపై వివక్ష చూపుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1435 మందిని రెగ్యులరైజ్ చేసినా ఇంకా రెండు వేల పోస్టులు ఖాళీగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు అమరేందర్, రమేష్, శివశంకర్, రాజేశ్వరి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

కలుపు నివారణతోనే మెరుగైన దిగుబడి

- నడిగూడెం ఏఓ రాజగోపాలరావు

పాడి పంట



రాజగోపాలరావు, ఏఓ, నడిగూడెం



కలుపు మందు చల్లుతున్న రైతు



కోనోవీడర్ ద్వారా కలుపు తీస్తున్న రైతు

నడిగూడెం : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో బోర్లు, బావులు, చెరువుల కింద వరి నాట్ల పనులు ముమ్మ రంగా జరుగుతున్నాయి. అలాగే అనేక మంది రైతు లు వెదజల్లే, డ్రమ్ సీడర్ పద్ధతుల్లో కూడా వరి సాగు చేపట్టారు. ఇప్పటి నుంచే వరి లో కలుపు నివారణ చర్యలు చేపడితే పంట దిగుబడులు అధికంగా పొందవచ్చని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం.రాజగోపాలరావు సూచిస్తున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..

నెల రోజుల పాటు..

నాటు వేసిన వరిలో మొదటి 30 రోజులు, నేరుగా విత్తిన వరిలో మొదటి 45 రోజుల వరకు కలుపు లేకుండా జాగ్రత్తలు పాటిం చాలి. గడ్డిజాతి, తుంగజాతి, వెడల్పాటి ఆకుల నివారణకు బ్యుటాక్లోర్ 1.0 నుంచి 1.60 లీటర్లు లేదా అనిలోఫాస్ 400 నుంచి 600 మి.లీ, లేదా ప్రెటిలాక్లోర్+పొరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 4.0. కిలోలు, లేదా ప్రెటిలాక్లోర్ 400 నుంచి 600 మి.లీ. లేదా ఒక ఎకరానికి నాటిన మూడు రోజుల లోపు 20 కిలోల ఇసుకలో కలిపి చల్లాలి. నాటిన 10 నుంచి 15 రోజుల లోపు అయితే బెంటజోన్ 800 మి.లీ. లేదా బిస్‌పైరిబాక్ సోడియం 80 నుంచి 100 మి.లీ. లేదా సైహలోఫాప్ బ్యుటైల్ 300 మి.లీ. లేదా ఫెనాక్స్ ప్రాప్-పి-ఇథైల్ 250 మి.లీ. నాటిన 15 నుంచి 25 రోజుల లోపు అయితే 2,4డి ఇథైల్ ఎస్టర్ 1 లీటరు లేదా మెట్‌సల్ఫ్యూరాన్ మిథైల్ 80 గ్రాములు ఒక ఎకరానికి ఉపయో గించాలి.

డ్రమ్‌సీడర్, శ్రీ పద్ధతుల్లో అయితే......

డ్రమ్‌సీడర్, శ్రీ పద్ధతుల్లో అయితే సాళ్ల మధ్య కోనోవీడర్‌తో , పవర్ వీడర్‌తో గానీ నాటిన 30 రోజుల లోపు మూడు సార్లు కలుపు తీయాలి. ఈ పరికరాల ద్వారా కలుపును తీస్తే తీసిన కలుపు భూమిలో కలవడంతో అది కుళ్లి పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడుతుంది. అలాగే ఇద్దరు కూలీలతో ఒకే రోజు కలుపును తొలగించవచ్చు. ఇలా చేయ డం వలన పైరు లో పిలకలు, దుబ్బులు అధికంగా వస్తాయి. దీంతో పంట దిగుబడి రెండు నుంచి మూడు బస్తాల వరకు పెరిగే అవకాశముంటుంది.